క్లుప్తంగా

రైతుకు హార్వెస్టర్ అందజేత

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటి పరిధిలోని శాంతినగర్ ఏపీజీవీబీ బ్యాంకు ద్వారా మంజూరైన హార్వెస్టర్‌ను బ్యాంక్ రీజినల్ మేనేజర్ రంజిత్‌కుమార్ చేతుల మీదుగా రైతు రవికి తాళాలు అందజేశారు. ఈసందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని యంత్రాలు కొనుగోలు చేయాలని సూచించారు. హార్వెస్టర్ (వరి కోత యంత్రం) మొత్తం ఖరీదు రూ.40 లక్షలు కాగా బ్యాంక్ నుంచి రూ.25 లక్షలు రుణ సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రంజిత్, మేనేజర్ గురువారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మహికాంత్, ఫీల్డ్ ఆఫీసర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ధరూరు: మండలంలోని ఓబులోనిపల్లికి చెందిన లబ్ధిదారులకు మంజూరయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, నాగన్న, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి



కేటీదొడ్డి: బడిబయటి పిల్లలను బడికి పంపాలని మండలంలోని మైలగడ్డ స్టేజీ సమీపంలోని సీఆర్‌పీఎఫ్, చైల్డ్ లేబర్ సిబ్బంది ఆధ్వర్యంలోని ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. బోలెరా వాహనాల్లో 18 ఏళ్ల లోపు పిల్లలను కూలీలకు తీసుకెళ్లకూడదని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలతో పనులు చేయిస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారాన్నరు. పాతపాలెం, నందిన్నెలో బడి బయటి పిల్లలకు అవగాహన కల్పించి 21 మంది చిన్నారులకు పాఠశాలలో చేర్పించారు.

పరిశుభ్రత పాటించాలి



ధరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచితో పాటు శుచి శుభ్రత పాటించి అందించాలని ఎంఈఓ రవీంద్రబాబు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మండలంలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఏ–1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

బ్లాస్టింగ్‌లో యువకుడికి గాయాలు

గట్టు: మండలంలోని జోకన్‌గట్టు గుట్ట వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన బ్లాస్టింగ్‌లో నవీన్‌కుమార్, పద్మమ్మ గాయపడ్డారు. ఈ ఘటనపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా జోకన్‌గట్టు గుట్ట వద్ద బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం నిర్వహించే ముందు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. సల్కపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ పద్మమ్మ పొలంలో పనిచేస్తున్న క్రమంలో గుట్టలో నిర్వహించిన బ్లాస్టింగ్ కారణంగా సుమారు 10 కేజీల బరువు ఉన్న రాళ్లు గాలిలోకి ఎగిరి పొలంలో పనిచేస్తున్న నవీన్‌కుమార్ భుజం, పక్కటి ఎముకలపై పడటంతో గాయపడ్డారు. పద్మమ్మ నడుములపై రాళ్లు పడటంతో కిందపడినట్లు రైతులు తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా బ్లాస్టింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు గట్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్ అందజేత

వనపర్తి రూరల్: మండలంలోని సింగాయిపల్లి తండాకు చెందిన దివాకర్ సెల్‌ఫోన్ పోయిందని వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి, రికవరీ చేసి బాధితుడికి అందజేశామని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

పథకాల అమలుపై అధ్యయనం



మానవపాడు కేజీబీవీ విద్యార్థులతో ట్రెయినీ ఐఏఎస్‌లు

అలంపూర్: క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన ఐదుగురు ట్రెయినీ ఐఏఎస్‌లు గురువారం అలంపూర్ మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ సరస్వతి వారికి ఆహ్వానం పలికి, ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి గురించి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య పనులు

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఉప్పేరు గ్రామాన్ని సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌లు మనోజ్‌కుమార్ యాదవ్, సిమ్రాన్ భరద్వాజ్, రిషబ్ జైన్ ఆదర్శ్, దివ్య ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం ధరూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల వివరాలను తెలుసుకున్నారు.

మానవపాడు: కేజీబీవీ పాఠశాల సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌లు రాజీవ్, వల్లీ, ప్రసన్నకుమార్, సయాలి అశోక్ గైక్వాడ్, విజయ మరుగుదొడ్లు, తరగతి గదులు, భోజన వసతి



ఉప్పేరులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు.

బీచుపల్లి ఆలయంలో పూజలు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శిక్షణ నిమిత్తం వచ్చిన సివిల్ సర్వీస్ అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ రామన్‌గౌడ్ వారిని శేష వస్త్రాలతో సన్మానించారు. ఆలయ అర్చకులు మారుతీచారి అధికారులకు తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఉన్నతంగా రాణించాలి

ఉండవెల్లి: ట్రెయినీ సివిల్ సర్వీస్ అధికారుల బృందం మూడో రోజు పోలీస్‌స్టేషన్, పల్లె దవాఖానా, ఎంపీడీఓ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పల్లె దవాఖానలో ఏఎన్ఎంలు, ఆశాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి కేసు నమోదు, రికార్డుల నిర్వహణ, క్రైం మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు హేమలత, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్‌ను ట్రెయినీ కలెక్టర్లు, ఎస్పీలు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, మధ్యాహ్న భోజన పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార వివరాలను సేకరించారు. అనంతరం మహిళా సమాఖ్య కార్యాలయం, ఉపాధి హమీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్లు పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, వికాస్, ఆదాం మొయిద్దీన్, పుష్కర వరమ, హర్షిత్ కుమార్, అలావత్‌లు, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్, సూర్యప్రకాష్‌రెడ్డి, స్వరూపరాణి, సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో..



బీచుపల్లి ఆలయంలో..

క్రీడలతోనే మానసికోల్లాసం



రాజోళి సీఎం కప్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

శాంతినగర్: ఆటలతో విద్యార్థులకు మానసికంగా ఉల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. వడ్డేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నిర్మలాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ, ఖోఖో పోటీలను ఎంపీడీఓ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలు ఆడటం ద్వారా శారీర ధృఢత్వంతో పాటు మెదడు చురుకుదనంగా పనిచేస్తుందని, చదువుల్లో బాగా రాణిస్తారన్నారు. సీఆర్పీ నాగేష్, ఎంపీఎఫ్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు బాటలు..

రాజోళి: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, తహసీల్దార్ పి రామ్మోహన్ అన్నారు. రాజోళి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ స్థాయిలో ఆటలు ప్రారంభించామని తెలిపారు. క్రీడల్లో తమ ప్రతిభను చాటిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

క్రీడా పోటీల షెడ్యూల్ మార్పు..

అయిజ: మండలంలో నిర్వహించనున్న మండల



వడ్డేపల్లిలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

స్థాయి సీఎం కప్ 2024 ఆటల పోటీల సమయాన్ని మార్చినట్లు ఎంపీడీఓ వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 28 తేదీల్లో రెండు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహించాలని ఇటీవల ప్రకటించామని, విద్యార్థులకు త్రైమాసిక పరీక్షలు నిర్వహిస్తుండడంతో షెడ్యూల్ మార్పు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయం సమీపంలోని క్రీడా మైదానంలో క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ ఉదయం 11 గంటల వరకు క్రీడాకారుల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ధరలు నియంత్రించడంలో విఫలం

రాజోళి: నిత్యావసర ధరలను నియంత్రిండంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీపీఎం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు అన్నదాతలకు రైతు భరోసా జమ చేయచేలేదని, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా అందలేదని వాపోయారు. గద్వాలలో శుక్రవారం జరిగే సీపీఎం మూడో మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దిలేటి, చిన్న, మోహన్, జమ్మన్న, సీపీఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

గద్వాలటౌన్: దొంగతనం నెపం ఆపాదించి, మైనర్ బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండల పద్మావతి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గద్వాలకు చెందిన సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో దొంగతనం జరిగిందని మైనర్ బాలికపై ఫిర్యాదు చేసి, పోలీసు స్టేషన్‌కు పిలిపించి వేధించారని ఆరోపించారు. దీన్ని మైనర్ బాలిక అవమానంగా భావించి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. రెండు నెలల క్రితం గద్వాలలో దొంగతనం జరిగితే, ఈ నెల 11న మల్దకల్‌లో ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాధిత కుటుంబ సభ్యులను రాజకీయ ఒత్తిళ్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధికి సీడ్ ఆర్గనైజర్ సోదరుడు కావడం వల్లనే చర్యలు తీసుకోవడానికి పోలీసులు జంకుతున్నారని ఆరోపించారు. తక్షణమే సీడ్ ఆర్గనైజర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ తరపున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ జయశ్రీ, మహిళా మోర్చా నాయకురాలు భారతి, వెంకటమ్మ, చంద్రకళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యదర్శికి ఫిర్యాదు చేయండి

శాంతినగర్: మున్సిపల్ కమిషనర్ బదిలీ గురించి మున్సిపల్ రాష్ట్ర కార్యదర్శికి లేదా మున్సిపల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని హైకోర్టు సూచించినట్లు హైకోర్టు అడ్వకేట్ డీఎల్ పాండు తెలిపారు. వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చేయడం లేదని, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఆయనను బదిలీ చేయాలని గతంలో కలెక్టర్‌కు వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పట్టించుకోవడం లేదంటూ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టును చైర్మన్ ఆశ్రయించారని అడ్వకేట్ తెలిపారు. కోర్టులో వాదనల అనంతరం మున్సిపల్ కమిషనర్‌పై మున్సిపల్ కార్యదర్శికి, మున్సిపల్ డెరెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని హైకోర్టు సూచించినట్లు అడ్వకేట్ పేర్కొన్నారు.

క్షేత్ర ప్రదర్శనలతో విద్యార్థుల్లో వికాసం



అలంపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాల విద్యార్థులకు గురువారం క్షేత్ర ప్రదర్శన చేశారు. పుస్తకాల్లో ఉన్న చదువుతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పర్యటన చేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అందులో భాగంగా అలంపూర్ పట్టణంలోని జూనియర్ కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, బ్యాంకుల్లో లావాదేవీలు, పోలీస్‌స్టేషన్, కూరగాయల దుకాణాలను సందర్శించి అక్కడి పరిస్థితులను విద్యార్థులకు వివరించారు. అలంపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న జోగుళాంబ రైల్వేస్టేషన్ సందర్శించారు. ఆయా వ్యవస్థల్లో రోజువారిగా కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. సమాజంలో ఉన్న వ్యవస్థలు తీరు వాటి వినియోగం వంటి అంశాలను విద్యార్థులకు పెంపొందించడానికి క్షేత్ర పర్యటనలు దోహదపడతాయని విశ్వాశాంతి విద్యాలయాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

భూఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

అమరచింత: వ్యవసాయ పొలాన్ని ఆక్రమించేందుకు యత్నం చేస్తూ వ్యవసాయ పరికరాలతో పాటు బావిని, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారంటూ కుర్వ గోవింద్, గ్రామానికే చెందిన రంగన్నపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని నందిమళ్లకు చెందిన కుర్వ గోవిందుకు సర్వేనంబర్ 230లో 25 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. పక్కనే సర్వేనంబర్ 231లో ఉన్న కుర్వ రంగన్న తన ఎకరం పొలాన్ని గోవింద్ కబ్జా చేశారంటూ తరచూ గొడవకు పాల్పడేవారని ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కోర్టు పరిధిలో ఉన్న పొలంలోని వ్యవసాయ బావితో పాటు పంపుసెట్లను కుర్వ రంగన్న తన కొడుకులతో కలిసి మంగళవారం మధ్య రాత్రి ధ్వంసం చేశాడంటూ బాధితుడు బుధవారం ఫిర్యాదు ఇవ్వడంతో గురువారం ఘటన స్థలాన్ని పరిశీలించి రంగన్నపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

అయిజ: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాల మహానాడు అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగముని అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాలమహానాడు నాయకులు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా రంగముని మాట్లాడుతూ.. ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభకు అలంపూర్ నియోజకవర్గంలోని మాలలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మునిస్వామి, శేఖర్, రాము, మల్లికార్జున్, నరసింహులు, వీరేష్, శ్రీకాంత్, తాయప్ప, వెంకటన్న, ప్రవీణ్, లింగన్న, పరశురాముడు, మునిస్వామి, రవి, సాయి, గణేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల కేజీబీవీ



పాఠశాలకు ఆనుకొని ఉన్న గుంతలో నిలిచిన మురుగు

- మౌలిక వసతులు లేక అవస్థలు
- ఫ్యాన్లు లేక దోమలతో సావాసం
- ఇబ్బందులు పడుతున్న బాలికలు

ఎర్రవల్లి: బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను స్థాపించింది. కానీ పలు పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పలు సమస్యలు వెంటాడుతుండటంతో నిత్యం వాటితో సాహసం చేయాల్సి వస్తుందని విద్యార్థినులు వాపోతున్నారు. ప్రభుత్వం బాలికల చదువుకు రూ.కోట్లు ఖర్చు చేసి పెద్దపీట వేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, నిధుల కొరత కారణంగా సమస్యల వలయంలోనే పాఠశాలలు ముందుకు సాగుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలలో రాత్రివేళల్లో బాలికలు చదువుకునేందుకు సరైన లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు కూడా పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో ఈగలు, దోమలతో నిద్రపోవడం లేదంటున్నారు.

ముప్పుగా మారిన గుంత

పాఠశాలను నిర్మించే క్రమంలో భవనం కోసం ఆవరణలో మట్టిని అధికంగా తవ్వడంతో పెద్ద గుంత ఏర్పడింది. ఇది పాఠశాలకు ఆనుకొని ఉండటం, వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో నిత్యం విషసర్పాలు సంచరిస్తున్నాయని బాలికలు వాపోతున్నారు. వర్షాకాలంలో గుంత పూర్తిగా నీటి నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరీ లేక అవస్థలు

పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీని నిర్మించకపోవడంతో నిత్యం పశువులు, గొర్రెలు సంచరిస్తున్నాయి. వీటివల్ల భోజనం చేసే సమయంలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థినులు మొరపెట్టుకున్నారు. పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యేలు వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా.. నీటి రాతలుగానే మారాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిపైనా అధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బాలికలు వేడుకుంటున్నారు.

భయంతో గడపాల్సి వస్తోంది..



పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీగోడ లేకపోవడంతో ప్రతిరోజు ఆవరణంలోకి విష పురుగులు రావటంతో భయపడుతూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– లావణ్య, 8వ తరగతి

విషజ్వరాల బారిన..



పాఠశాల ఆవరణంలో ఉన్న పెద్ద గుంతలో మురుగు నిండుకుండలా ఉండటంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రాత్రివేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో పాటుగా వర్షాకాలంలో అధికంగా విష జ్వరాల సంచరిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతను త్వరగా పూడ్చివేయాలి.

– జయలక్ష్మి, 7వ తరగతి

దాతలు ముందుకు రావాలి..

ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కొరత కారణంగా పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించలేకపోతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి పలు మార్లు సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయింది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహాయం అందిస్తే గుంతను పూడ్చడంతో పాటుగా పలు సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతాయి.

– ఆసియా బేగం, పాఠశాల ప్రత్యేక అధికారి

టీకాలతో పశువుల్లో రోగనిరోధన శక్తి



ఎల్కూరులో గాలికుంటు టీకాలను వేస్తున్న వైద్య సిబ్బంది

మల్దకల్: వర్షాకాలంలో పశువులకు సోకే సీజనల్ వ్యాధులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు పాడి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ఎల్కూరులో నిర్వహించిన పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునే వీలుంటుందన్నారు. ప్రతి రైతు తమ పశువులకు ఏడాదికి రెండుసార్లు టీకాలు వేయించాలని సూచించారు. అదే విధంగా పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. అనంతరం గ్రామంలోని 252 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు గద్వాల అసిస్టెంట్ డైరెక్టరు రమేష్, వినయ్‌కుమార్, యామినిసాయి, ఉష, వెంకటరాజు పశువైద్యసిబ్బంది ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు

మానవపాడు: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక మృతి చెందడం బాధాకరమని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగిపోగు రాంబాబు అన్నారు. గురువారం మండలకేంద్రంలో మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఒక సీడ్ ఆర్గనైజర్ బాలికను పనిలో పెట్టుకుని దొంగతనం చేసిందని నెపంతో తప్పుడు కేసు పెట్టడంతో బాలిక మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసి కర్నూల్ పట్టణంలో 13 రోజుల పాటు చికిత్స పొందుతూ గురువారం మరణించిందని తెలిపారు. ఆమె మృతి తీవ్రంగా కలిచివేసిందన్నారు. బాలిక మృతికి కారణమైన నిందితులను తక్షణమే జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేపల్లె రాజు, యేసురాజు, దావీద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.